క్లుప్తంగా

ఘనంగా వీరభద్రస్వామి పల్లకీ సేవ



వీరభద్రస్వామి సన్నిధిలో స్వామి వారి పల్లకీ సేవ

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో సోమవారం వీరభద్రస్వామి, భద్రకాళిమాత ఉత్సవ మూర్తుల పల్లకీ సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆలయం వద్ద భద్రకాళి సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, మాజీ జెడ్పీటీసీ మేకల బాబు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నం వడ్డిస్తున్న శ్రీనివాసుల స్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని మున్సిపల్ పెట్రోలు బంకు సమీపంలో సోమవారం సోమావతి అమావాస్య సందర్భంగా కాలభైరవస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కాలభైరవస్వామి చిత్రపటానికి, విగ్రహానికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి పూలతో అలంకరించారు. వేకువజామున రామేశ్వరంలోని కాలభైరవస్వామికి విశేష పూజలు చేశారు. కాలభైరవస్వామి ఉపాసకులు శ్రీనివాసుల స్వామి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు పెద్ద మల్లికార్జున, చరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


ఖరీఫ్ ప్రణాళికపై గ్రామ సభ



పోస్టర్లు ప్రదర్శిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది, రైతులు

మైదుకూరు : మండలంలోని ముదిరెడ్డిపల్లెలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది సోమవారం ఖరీఫ్ ప్రణాళికపై గ్రామ సభ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో గ్రామానికి చెందిన రైతులు సాగు చేస్తున్న పంటల గురించి గ్రామసభలో చర్చించారు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంటలను పండించేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులు రామరాజు, గురు ప్రసాద్‌ను సత్కరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తెలిపే పోస్టర్లను రైతులు, మహిళా సంఘాల సభ్యులతో కలిసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామనందారెడ్డి, ఆదినారాయణ, నాగలక్ష్మి, సేవా నాయక్ పాల్గొన్నారు.

నివాళి



వెంకటరెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్

పోరుమామిళ్ల: కొండుగారిపల్లెకు చెందిన కాంట్రాక్టర్ పెద్దిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం సోమవారం సాయంత్రం మృతదేహాన్ని కొండుగారిపల్లెకు తెచ్చారు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కొండుగారిపల్లెకు వెళ్లి వెంకటరెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, బి.కోడూరు మండల వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి, నాయకులు రవిచంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేతల అత్యుత్సాహం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడపలో ఈ నెల 27, 28, 29వ తేదీలలో నిర్వహించే మహానాడు సందర్భంగా టీడీపీ నేతలు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. పులివెందుల రింగురోడ్డులో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాల చుట్టూ పసుపు జెండాలు కట్టి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. అలాగే పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న వైఎస్సార్ విగ్రహం, కడప రోడ్డులోని చందమామ డాబా వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం, రింగురోడ్డు చుట్టూ ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు టీడీపీ శ్రేణులు పసుపు జెండాలను కట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మార్కెట్ నిర్మాణంపై చేతులెత్తేసిన ప్రభుత్వం!



కాంట్రాక్టు కంపెనీ కార్యాలయానికి తాళాలు వేసిన దృశ్యం



ఆగిపోయిన మార్కెట్ నిర్మాణం

- తట్టా బుట్ట సర్దుకెళ్లిన కాంట్రాక్టర్
- ప్రజాభిప్రాయ సేకరణతో ఇతరులకు అప్పగించేందుకు వ్యూహం

ప్రొద్దుటూరు : రాష్ట్రంలోనే అత్యాధునికంగా ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్‌ను నిర్మించేందుకు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. రూ.51కోట్ల అంచనాతో 2021 డిసెంబర్ 23న మార్కెట్ నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నాటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మార్కెట్ నిర్మాణంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ప్రత్యేకంగా చర్చించి నిధులు మంజూరు చేయించుకున్నారు. పనుల ప్రారంభ సమయంలో కూడా రాష్ట్రానికి సంబంధించిన ప్రముఖ నేతలందరూ హాజరయ్యారు. సుమారు రూ.21 కోట్ల పనులు పూర్తయ్యాయి. గడువు లోపల వ్యాపారులకు కొత్త మార్కెట్ నిర్మించి ఇస్తారని అందరూ భావించారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఓటమి చెందడం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీన్ రివర్స్ అయింది. మార్కెట్ నిర్మాణంపై ఆశలు సన్నగిల్లాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు ఇవ్వడం సాధ్యం కాదని, మున్సిపాలిటీ పన్నుల నుంచే డబ్బులు వెచ్చించి నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిర్ణయంతో మార్కెట్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రభుత్వ ఆదేశాలను గమనించిన కాంట్రాక్టు సంస్థ పనులను ఆపేసింది. ప్రభుత్వం నుంచి బకాయిలు మంజూరు కాకపోవడం, నిధులు ఇవ్వలేమని చెప్పడంతో కాంట్రాక్టర్ తట్టాబుట్ట సర్దుకుని వెళ్లిపోయారు. ప్రధానమైన మార్కెట్ నిర్మాణంపై ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంలో అధికార పార్టీకి చెందిన నాయకులు విఫలమయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మార్కెట్ వ్యాపారుల పరిస్థితి ఏంటి?

ప్రభుత్వం నుంచి మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోగా వ్యాపారుల ద్వారా అభిప్రాయ సేకరణ జరిపి ఈ స్థలాన్ని ఆసక్తి కలిగిన వ్యాపార సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నం జరుగుతోంది. ఇందులో భాగంగానే ఈనెల 23న పట్టణంలోని వ్యాపారులతో సమావేశం నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ప్రకటన విడుదల చేసి, మళ్లీ వాయిదా వేశారు. రాయలసీమలో ప్రొద్దుటూరు మార్కెట్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. మదనపల్లి, అనంతపురం జిల్లాల నుంచి నిత్యం సరుకులు ఇక్కడికి రావడం, ఇక్కడి నుంచి వైఎస్సార్, కర్నూలు జిల్లాలకు చెందిన వ్యాపారులు తీసుకెళ్లడం జరుగుతోంది. 1982లో శివాలయం ఎదురుగా కూరగాయల మార్కెట్‌ను నిర్మించారు. వైఎస్సార్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ఈ మార్కెట్‌ను ప్రారంభించడం జరిగింది. ఈ మార్కెట్‌పై కొన్ని వందల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి.

ఆందోళనలో వ్యాపారులు

మార్కెట్ నిర్మాణం అయి చాలా ఏళ్లు కావడంతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా లేకపోవడంతో కొత్త మార్కెట్‌ను నిర్మించాలనే ప్రతిపాదన చాలా ఏళ్లుగా వస్తోంది. గతంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రయత్నించి విజయం సాధించలేకపోయారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న రాచమల్లు శివప్రసాదరెడ్డి వ్యాపారులందరిని ఒప్పించి పాత మార్కెట్‌ను తొలగించారు. తప్పనిసరిగా మార్కెట్‌లో ఉన్న వ్యాపారులకే కొత్త మార్కెట్ నిర్మాణం తర్వాత ఎవరి స్థలాలు వారికి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు వ్యాపారులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు తయారు చేసి పంపిణీ చేశారు. ఇప్పటికి మార్కెట్ నిర్మాణంలో గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం మార్కెట్ నిర్మాణంపై చేతులెత్తేసిన ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఇతర వ్యాపారులకు అప్పగిస్తే కూరగాయల మార్కెట్‌ను నమ్ముకుని జీవిస్తున్న వ్యాపారుల పరిస్థితి ఏమిటని చర్చ సాగుతోంది. రాజకీయ వైరుధ్యంతో నాయకులు తమ కడుపు కొడతారేమోనని వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది.

దెబ్బతిన్న పైపులకు మరమ్మతులు చేపట్టాలి



పైపులైను దెబ్బతినడంతో వృథాగా పోతున్న నీరు

గోపవరం : మండలంలోని రాచాయపేటలో తాగునీటి పథకానికి ఉపయోగించే పైపులైను దెబ్బతినడంతో నీరంతా వృథాగా పోతుంది. దీంతో నీటి సమస్య ఏర్పడింది. దెబ్బతిన్న పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలని నెలల తరబడి గ్రామ పంచాయతీ అధికారులకు గ్రామస్తులు తెలియజేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. కాగా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ ఇద్దరి మధ్య సమన్వయ లోపంతో సకాలంలో అభివృద్ధి పనులు జరగడం లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. చేసిన పనులకు ఎలాంటి బిల్లులు చెల్లించడం లేదని సర్పంచ్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో పనులు జరగకపోవడం కూడా కారణంగా చూపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి దెబ్బతిన్న పైపులైనుకు మరమ్మతులు చేసి నీరు వృథా కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పచ్చిరొట్ట విత్తనాల కోసం ఎదురుచూపులు

గోపవరం : భూసారవంతం కోసం ఉపయోగించే పచ్చిరొట్ట విత్తనాలు (జీలగలు, జనుములు) కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్‌లో వివిధ పంటలు సాగు చేసే రైతులు ముందుగా భూసారవంతం కోసం పచ్చిరొట్ట విత్తనాలను వేయడం జరుగుతుంది. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు ముందుగానే కురుస్తుండటంతో చెరువులు, బోర్ల కింద పంటలు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. రైతులకు ముందుగానే జీలగలు, జనుములు సబ్సిడీ ద్వారా వచ్చేవి. ప్రస్తుతం ఇప్పటి వరకు ఎలాంటి విత్తనాలు మండలానికి మంజూరు కాకపోవడంతో రైతులు రైతుసేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్‌కు ముందే 50 శాతం సబ్సిడీతో జీలగలు, జనుములు ఆయా రైతుభరోసా కేంద్రాలకు చేరేవి. అవసరమైన రైతులు విత్తనాలను తీసుకెళ్లి భూసారవంతం కోసం ఉపయోగించేవారు. ఇప్పటి వరకు జీలగలు, జనుములు మంజూరు కాకపోగా కనీసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా మొదలు పెట్టలేదు. రైతుసేవా కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది కూడా సక్రమంగా లేకపోవడంతో అసలు జీలగలు, జనుములు వస్తాయా, రావా అన్న సందేహం రైతుల్లో నెలకొంది. సమాచారం కోసం రైతు సేవా కేంద్రాలకు వెళ్లిన రైతులకు ఎలాంటి సమాధానం దొరకడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సబ్సిడీ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను సకాలంలో అందజేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



పిచ్చికుక్క కాటు బాధితులను పరామర్శిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : పట్టణంలో ఒకే రోజు పిచ్చికుక్క 45 మందిని దాడి చేసి గాయపరిచిన నేపథ్యంలో ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మస్తాన్‌షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వాసుపత్రిలో కుక్కకాటు బాధితులను డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వీధికుక్కలు, పందులు, కోతులను తరలించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని గతంలో అనేక పర్యాయాలు మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోలేదన్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే 45 మంది వృద్ధులు, మహిళలు, చిన్నారులు కుక్కకాటుకు గురవడం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధికుక్కలకు వ్యాక్సినేషన్ వేయించి ఊరి చివరకు తరలించాలని కోరారు. అలాగే కుక్కకాటు బాధితులకు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ నాయకులు సుధాకర్, షరీఫ్, నాయక్ పాల్గొన్నారు.

రేపు మహాజనసభ

ప్రొద్దుటూరు : స్థానిక ప్రొద్దుటూరు కో–ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ మొదటి మహాజనసభను ఈనెల 28న బుధవారం ఉదయం 11 గంటలకు స్టోర్స్ ఆవరణలో నిర్వహించనున్నట్లు స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి ఒక ప్రకటనలో తెలిపారు. స్టోర్స్ జమా ఖర్చులు, పాలక వర్గ సభ్యులు చేసిన తీర్మానాలను ఆమోదించుట, 2025–26 స్టోర్స్ అంచనా బడ్జెట్‌ను ఆమోదించుట తదితర విషయాలపై సభలో చర్చిస్తారని ఆమె పేర్కొన్నారు.

ఆర్టీపీపీ పైపులైన్ లీకేజీని అరికట్టాలి

చాపాడు : బ్రహ్మంసాగర్ నుంచి రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (ఆర్టీపీపీ) పైపులైన్ లీకేజీలను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ మైదుకూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్ చాపాటి రామ సుధాకర్‌రెడ్డి కోరారు. సోమవారం ఈయన మాట్లాడుతూ బ్రహ్మంసాగర్ నుంచి 70 కిలో మీటర్ల పొడవునా నిర్మించిన పైపులైన్‌కు మైదుకూరు – ప్రొద్దుటూరు మధ్య చాపాడు మండలంలో అధికంగా లీకేజీలు ఏర్పడుతున్నాయన్నారు. రాయలసీమకు తలమానికమైన ఆర్టీపీపీపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆర్టీపీపీకి నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక లేపాక్షి డిగ్రీ కళాశాల విద్యార్థులు టీసీఎస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాతపరీక్ష, ఇంటర్వ్యూలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎస్.గీతిక, టి.సాత్విక ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, కరస్పాండెంట్ వీర రాఘవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు పోరాటం

పులివెందుల టౌన్ : క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు పోరాడుతామని దళిత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కోలా ప్రసాద్ తెలిపారు. సోమవారం పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో ఉన్న యేసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో అలియన్స్ ఫర్ పాస్టర్స్ డెవలప్‌మెంట్ (ఏపీడీ), క్రైస్త హక్కుల పరిరక్షణ దళం(సీఆర్పీ ఫోర్స్) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల్లో ఐక్యత లోపించడం వలనే ఎక్కువగా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎత్తిపోతల పథకం పూర్తయ్యేనా.. రైతుల బెంగ తీరేనా?



వరికుంట్ల చెరువు



తెలుగుగంగ ఎడమకాలువలో పారుతున్న నీరు

- ఎడారిని తలపిస్తున్న సాగునీటి చెరువులు
- అడుగంటిపోయిన భూగర్భజలాలు
- అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు
- ఆందోళనలో రైతులు

కాశినాయన : ఆరుగాలం కష్టపడుతున్న రైతన్నకు అడుగడుగునా అవరోధాలు ఏర్పడుతున్నాయి. అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది వారి పరిస్థితి. ఆయకట్టు చెరువులకు సాగునీరు అందించేందుకు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినా సగం పనులు పూర్తి చేసినా ఇప్పటికీ చుక్కనీరు అందని పరిస్థితి. ఒక పక్క అతివృష్టి మరో పక్క అనావృష్టి, చీడపీడలు, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు ఇలా ఏదో రకంగా రైతులను నట్టేట ముంచుతున్నాయి. దీనికి తోడు వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. బోరుబావుల్లో నీటిమట్టం తగ్గడంతో పంటలు సాగు చేయలేని పరిస్థితి. వర్షాలు అరకొరగా కురవడంతో మండలంలోని చెరువులు ఏటా ఎండుతున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు తాము అధికారంలోకి వస్తే నెల రోజుల్లోనే లిఫ్ట్ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరు నింపుతామని ఎన్నికల్లో వాగ్దానాలు ఇచ్చినా ఇప్పటి వరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది.

రూ.45 కోట్లతో పనులు

మండలంలోని వరికుంట్ల, గంగనపల్లె, కొండ్రాజుపల్లె, ఇటుగుల్లపాడు, గొంటువారిపల్లె, బాలాయపల్లె చెరువుల కింద 5 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాభావంతో పొలాలు బీళ్లు బారడంతో 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ పొలాలను సాగులోకి తెచ్చేందుకు ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి నీరు అందించాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా రూ.45 కోట్ల నిధులు మంజూరు చేసింది. తెలుగుగంగ ఎడమ కాలువ ద్వారా మొదటగా వరికుంట్ల, గొంటువారిపల్లె, బాలాయపల్లె, గంగనపల్లె చెరువులకు నీరు అందించేందుకు పైపులైను పనులు పూర్తయ్యాయి. 70 శాతం పూర్తయిన పనులు ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయాయి. అప్పట్లోనే పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్‌కు రూ.7 కోట్లు బిల్లులు రావాల్సి ఉంది. ఆ నిధులు మంజూరైతే పని పూర్తి చేస్తానని ఆయన చెబుతున్నారు.

పక్కనే నీరు ఉన్నా..

బ్రహ్మంసాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి పోరుమామిళ్ల చెరువుకు వదిలారు. పక్కనే ఆ నీరు పల్లెల మీద వెళుతున్నా ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. భూగర్భజలాలు అడుగంటిపోయి బోరుబావుల్లో నీరు రాకపోవడంతో కొంత మంది రైతులు వ్యవసాయం చేయలేక హైదరాబాద్, బెంగళూరు, పూణే ప్రాంతాలకు వలసలు వెళ్లారు. కొంత మంది వర్షాధారంగా అరకొర పంటలను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి చెరువులకు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



సుందరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, నాయకులు

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమ శిక్షణా కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పర్యటించారు. కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు నగర్తి ప్రసాద్ తల్లి ఎంపీటీసీ, మండల ఉపాధ్యక్షురాలు సుందరమ్మ ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అప్పట్లో అందుబాటులో లేని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సోమవారం పల్లవోలు వెళ్లి సుందరమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వద్దిరాల సురేష్ నెల రోజుల క్రితం ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈయన ఇంటికి వెళ్లి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. చికిత్స అనంతరం తీసుకుంటున్న జాగ్రత్తలపై అడిగి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ప్రస్తుత రాజకీయ అంశాలపై చర్చించారు. ఈయనతో పాటు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జేష్టాది శాంతురాజు, గడ్డమీది రమణయ్య, చెట్టూరు మనోహర్, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సమరశీల పోరాటాలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్

బద్వేలు అర్బన్ : జిల్లా సమగ్రాభివృద్ధికి, పాలక ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు వేదికగా బద్వేలులో జరగబోవు సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వి.వీరశేఖర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం జేవీభవన్‌లో నిర్వహించిన మహాసభల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టుల పూర్తికి, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు, పాలక ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు మహాసభలో చర్చించి పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగుమస్తాన్, పట్టణ కార్యదర్శి బాలు, జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, నాగేశం, ఏరియా నాయకులు నాగరాజు, నాగసుబ్బయ్య, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిధులేమో అమరావతికి.. ఆడంబరాల కోసం కడపకా?

ప్రొద్దుటూరు : నిధులన్నీ రాజధాని అమరావతికి తరలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు తమ పార్టీ ఆడంబరాల కోసం కడపలో మహానాడు నిర్వహించడం ఏమిటని రాయలసీమ మహిళా శక్తి కార్యదర్శి లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని అభివృద్ధిలో భాగంగానే కడపలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయాన్ని గుంటూరుకు తరలించారని, కొప్పర్తి పారిశ్రామికవాడను విజయవాడకు తరలించే ప్రతిపాదనలు తయారు చేయడం దారుణమని పేర్కొన్నారు. సీమ ప్రజలు నమ్మి ఓట్లు వేసేందుకు రాయలసీమను నిర్లక్ష్యం చేయడం తగదని తెలిపారు. సీమను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తూ వచ్చారని, రాయలసీమ మిషన్ పేరుతో ఈ ప్రాంత ప్రజలను మోసం చేసేందుకు కర్నూలును వ్యవసాయ ఆధారిత కేంద్రంగా, అనంతపురాన్ని ఆటో మొబైల్ పరిశ్రమగా, కడపను స్పోర్ట్స్ హబ్‌గా చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం వచ్చి ఏడాదైనా అభివృద్ధికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని తెలిపారు. మూతపడిన పరిశ్రమల గురించి మాట్లాడటం లేదని, ఉక్కు పరిశ్రమ ఊసే లేదన్నారు. మరో వైపు మంత్రి లోకేష్ నిరుద్యోగులకు ఆశలు పెంచేందుకు నిత్యం ప్రకటన చేస్తున్నారని విమర్శించారు.

అభివృద్ధిని విస్మరించిన 'కూటమి'

ప్రొద్దుటూరు : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ప్రొద్దుటూరు నియోజకవర్గం అభివృద్ధిపై ఎలాంటి మార్క్ పడలేదని, అభివృద్ధిని విస్మరించారని కాంగ్రెస్ పార్టీ నియోకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాషా తెలిపారు. ఈ విషయంపై ఆయన సోమవారం తహసీల్దార్ గంగయ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆగిపోయిన కూరగాయల మార్కెట్ పనులను ప్రారంభించాలని, శిథిలావస్థలో ఉన్న మంచినీటి పైపులైన్ మార్చాలని, మురుగునీటి కాలువలను ఆధునీకరించాలని, స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు. వందేళ్ల చరిత్రగల మున్సిపాలిటీలో అభివృద్ధి శూన్యమని తెలిపారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఉన్నా అభివృద్ధి జాడ కనిపించలేదన్నారు. ఓ వైపు సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు.

స్టీల్ ప్లాంట్ నిర్మించాలి

వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మించాలని మహానాడులో తీర్మానం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ స్టీల్ ప్లాంట్‌పై మహానాడులో తీర్మానానికి ఒత్తిడి తేవాలన్నారు. వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని మూడు సార్లు శిలాఫలకాలకే పరిమితమైందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో పురోగతి లేదన్నారు.

ధ్యానంతో మానసికోల్లాసం



ధ్యానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

చాపాడు : విద్యార్థులు ప్రతి రోజూ ధ్యానం చేయడం వలన మానసిక ఉల్లాసం పెరుగుతుందని మండల విద్యాధికారి–2 వంశీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా కార్యక్రమంలో భాగంగా 24వ రోజు సోమవారం విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ప్రతి రోజూ ధ్యానం కూడా చేయాలన్నారు. జీవన విధానంలో రోజు వారి పనులలో భాగంగా ధ్యానం చేస్తే ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉంటారని పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించడం వలన విద్యార్థులకు సెలవుల్లో అనేక రకాలైన విషయాలపై అవగాహన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జే శివశంకర్‌రెడ్డి, నక్కలదిన్నె బీడీసీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ మైథిలి ఆధ్వర్యంలో సోమవారం యోగాంధ్రలో భాగంగా యోగా శిక్షణ ఏర్పాటు చేశారు. యోగా ట్రైనర్లు గురయ్య, హరినాథ్, స్రవంతి ఆధ్వర్యంలో యోగాసనాలు వేసి శిక్షణ ఇచ్చారు. అనంతరం యోగా చేయడం వలన మానసిక ఒత్తిడి లేకుండా ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ముజఫర్‌రహీమ్, సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజోలి రిజర్వాయర్ సాధ్యం కాదనడం తగదు

ప్రొద్దుటూరు : రాజోలి రిజర్వాయర్ సాధ్యం కాదని కొందరు టీడీపీ నాయకులు మాట్లాడటం తగదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2014, 2024 ఎన్నికల ముందు రాజోలి రిజర్వాయర్, గుండ్రేవుల ప్రాజెక్టులను తామే నిర్మిస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. కడప మహానాడు సందర్భంగా టీడీపీ నాయకులు ఇటువంటి ప్రాజెక్టులు సాధ్యం కాదని చెప్పడం హాస్యాస్పదమని తెలిపారు. మహానాడులో కడప ఉక్కు పరిశ్రమ, గుండ్రేవుల, రాజోలి రిజర్వాయర్ ప్రాజెక్టులు, సిద్ధేశ్వరం అలుగుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

రేషన్ షాపు డీలర్లతో సమావేశం

కలసపాడు : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు మధురవాణి రేషన్ షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ జూన్ 1వ తేదీన రేషన్ సరఫరా వాహనాల ద్వారా రేషన్ పంపిణీని నిలిపి వేయడం జరిగిందని, కార్డుదారులు రేషన్ షాపుల వద్దకు వెళ్లి రేషన్ తీసుకోవాలన్నారు. కార్డుదారులందరికి బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివశంకర్, డీటీ రాజు, ఆర్ఐ హిందూజ, డీలర్లు పాల్గొన్నారు.

ఎన్నిక పారదర్శకంగా నిర్వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : అంజుమన్ కమిటీ సభ్యుల ఎన్నిక పారదర్శకంగా నిర్వహించాలని ఖాదర్ హుస్సేన్ మసీదు కమిటీ సభ్యులు అజ్మతుల్లా, అర్షద్ అలీ, రఫీ, నౌషద్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 13 మసీదుల నుంచి 27 మందిని ఎంపిక చేయాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. అంజుమన్ కమిటీ సభ్యులుగా ఉండాలంటే ఐదు పూటల నమాజ్ చేయడంతోపాటు హజ్, ఉమ్రా చేసిన వారిని ఎంపిక చేయాల్సి ఉందని తెలిపారు. మసీదుకు రాని వారిని కమిటీ సభ్యులుగా ఎన్నిక చేసేందుకు రాజకీయ నాయకులు చూడటం తగదని పేర్కొన్నారు. ముస్లిం సమాజానికి మేలు జరగాలంటే అంజుమన్ కమిటీ ఎన్నికలో రాజకీయ జోక్యం ఉండకూడదని వారు కోరారు.